క్లుప్తంగా

ఆస్పత్రికి నిరంతరం విద్యుత్ సరఫరా


సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న ఎస్ఈ

పాల్వంచరూరల్: పాల్వంచ ప్రభుత్వాస్పత్రిని శనివారం ఎన్పీడీసీఎల్ ఎస్ఈ భీకం సింగ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో విద్యుత్ సరఫరాను తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ.. ఆస్పత్రిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా, రోగులకు అసౌకర్యం కలగకుండా విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశించారు. ఆస్పత్రిలో అదనంగా మరో జనరేటర్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ముక్కంటేశ్వరరావు, డాక్టర్ సోమరాజు దొర, డీఈ నందయ్య, ఏడీఈ లక్ష్మణ్, ఏఈ ప్రతాప్‌కుమార్ పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న ఎడవల్లి కృష్ణ

పాల్వంచరూరల్: మండల పరిధిలోని దంతెలబోరు గ్రామంలో శనివారం కాంగ్రెస్ నాయకుడు ఎడవల్లి కృష్ణ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు గద్దల రమేష్, నాయకులు వి.ఎస్.చారి, సోమయ్య, కృష్ణ, నాగరాజు, సాంబయ్య, దేవిలాల్ పాల్గొన్నారు.

విరగబూసిన రేల చెట్టు



సురారం గ్రామ సమీపంలో రహదారి పక్కన రేల చెట్టు విరగబూసింది. పసుపు రంగు పూలతో రహదారిపై రాకపోకలు కొనసాగించే ప్రజలకు ఈ చెట్టు కనువిందు చేస్తోంది. ఔషధ గుణాలు కలిగిన రేల చెట్టు ప్రతీ ఏడాది వేసవికాలంలో మాత్రమే పూలు పూస్తుంది. ఈ చెట్టు పూలు, కాయలు ఔషధాల తయారీలో ఉపయోగిస్తారు. ఈచిత్రాన్ని శనివారం సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

– జూలూరుపాడు

పట్టణంలో పద్మవ్యూహం

- 'గూడెం'లో ట్రాఫిక్ చిక్కులతో అవస్థలు..
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- భారీ వాహనాల నిలుపుదలతో ఇబ్బందులు


గణేష్ టెంపుల్ రోడ్డులో వాహనాల రద్దీ

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం జిల్లా కేంద్రంలో వ్యాపార సముదాయాలున్న దగ్గర ఇరుకురోడ్లు ఉండడం, పెరుగుతున్న అన్నిరకాల వాహనాలతో ట్రాఫిక్ చిక్కులు పద్మవ్యూహాన్ని తలపిస్తున్నాయి. పట్టణంలో సూపర్‌బజార్ నుంచి మొదలుకొని మొర్రేడువాగు వరకు, చిన్నబజార్, పెద్దబజార్, గణేష్‌టెంపుల్ నుంచి మేదరబస్తీ వరకు ఉన్న రోడ్లు వ్యాపార కూడళ్లు. ఆయా రోడ్లలో ఉదయం 8 గంటలు మొదలుకొని రాత్రి వరకు వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీని వలన వాహనాలు ఆ రోడ్ల నుంచి బయటకు రావాలంటే దాదాపు 20 నుంచి 30 నిమిషాల సమయం పడుతోంది. ఆఫీసులకు, వివిధ పనులపై వెళ్లేవారు సరైన సమయానికి చేరుకోలేక ఇబ్బంది పడుతున్నారు.

ప్రధానంగా చిన్నబజార్, పెద్దబజార్‌లలో కిరాణాసరుకులు, ఎలక్ట్రికల్, బియ్యం, ఫర్నిచర్ సామగ్రి, వస్త్ర దుకాణాలు, హోల్ సెల్ దుకాణాలు ఎక్కువ సంఖ్యలో ఉన్నాయి. ఆయా దుకాణాలకు ఇతర ప్రాంతాల నుంచి నిత్యం పెద్దపెద్ద వాహనాల్లో సరుకులు వస్తుంటాయి. వాటిని దుకాణాల ముందు నిలిపి సరుకుల దించుతుంటారు. పని దాదాపు గంట నుంచి రెండు గంటల వరకు కొనసాగుతూ ఉంటుంది. అసలే ఇరుకురోడ్లు అందులో గంటల తరబడి భారీ వాహనాల నిలుపుదలతో ఆయా రోడ్లలో ట్రాఫిక్ సమస్యలు ఎక్కువగా ఉంటున్నాయి.

ఆ రోడ్లలో ప్రయాణించాలంటే వాహనదారులు, నడిచి వెళ్లే పాదాచారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో సరుకులు దిగుమతి చేసుకునేందుకు ట్రాఫిక్ పోలీసులు వ్యాపారస్తులకు సమయాలను కేటాయించారు. దానిని ప్రస్తుతం వ్యాపారస్తులు పాటించకపోవడం వలన ఆ రోడ్లలో ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయి. ప్రధానంగా పట్టణంలో పార్కింగ్ జోన్ లేకపోవడం వలన ఇరుకురోడ్లలోనే వాహనాల పార్కింగ్ చేయడం, మరోవైపు భారీ వాహనాల వలన ఇబ్బందులు తలెత్తున్నాయి.

గణేష్ టెంపుల్ రోడ్డులో తప్పని తిప్పలు...

జిల్లాలో ఆటోలు–17,427, ద్విచక్రవాహనాలు–1,20,212, కార్లు–19,032 వరకు ఉండగా, జిల్లా కేంద్రంలో ఒక్క దగ్గర వాహనాల మొత్తం సంఖ్యలో 40 శాతం వరకు వాహనాలుంటాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు. వాహనాల రద్దీ పట్టణంలో ఎక్కువగా ఉంటున్న నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది. కొత్తగూడెం జిల్లా కేంద్రం గణేష్ టెంపుల్ రోడ్డులో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో రోడ్డు చిన్నది కావడం వలన ఇబ్బందులు తలెత్తున్నాయనే నేపథ్యంలో ప్రస్తుతం రోడ్డును మున్సిపల్ ఆధ్వర్యంలో వెడల్పు చేశారు. అయినా కూడా ఇబ్బందులు తప్పడం లేదు. ఆ రోడ్డులో ప్రధానంగా ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులు, ఆస్పత్రులు, డయోగ్నిస్టిక్ సెంటర్లు ఉండడం వలన వాహనదారులు, వినియోగదారులతో రద్దీగా ఉంటుంది. ట్రాఫిక్ పోలీసులు రద్దీగా ఉండే ప్రాంతాలలో కూడా విధులు నిర్వహిస్తే, వాహనదారులకు కొంత ఉపశమనం లభించే అవకాశం ఉంటుంది. దీంతో మున్సిపల్ అధికారులు పార్కింగ్ జోన్ ఏర్పాటు చేయడం, ఫుట్‌పాత్‌ల అక్రమణలపై చర్యలు చేపట్టడం వంటివి చేయాల్సిన అవసరం ఉంది. దీంతో పాటుగా రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించిన రైతుబజార్, ఫ్రూట్ మార్కెట్ కాంప్లెక్స్‌లలోకి, సూపర్‌బజార్‌లోని ప్రధాన రోడ్డులో తోపుడు బండ్లపై పండ్లు అమ్మే వారిని పంపించాలి. దీని వలన వాహనాల పార్కింగ్‌కు కొంతస్థలం దొరికే అవకాశం ఉంటుంది. ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకుంటేనే కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. ట్రాఫిక్ చిక్కులపై ట్రాఫిక్ ఎస్సైను ఫోన్‌లో వివరణ కోరే ప్రయత్నం చేయగా స్పందించ లేదు.


చిన్నబజార్‌లో వాహనం నుంచి వస్తువుల దించుతున్న సమయంలో నిలిచిన ట్రాఫిక్

దృష్టి సారించాలి..

కొత్తగూడెం జిల్లా కేంద్రం గణేష్ టెంపుల్ రోడ్డు, చిన్నబజార్, పెద్దబజార్ రోడ్డు, రైల్వే స్టేషన్ పక్కన రోడ్డులో నిత్యం వాహనదాల రద్దీ ఉంటోంది. దీని వలన అత్యవసరం ఉన్నవారు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టి ఆయా రోడ్డులలో వాహనాల రద్దీ లేకుండా చర్యలు తీసుకోవాలి.

– హరి, వాహనదారుడు

యూనిఫాం తయారీ పరిశీలన


సీతానగర్ కాలనీలో స్కూల్ యూనిఫాంలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విద్యాచందన

పాల్వంచరూరల్: పాల్వంచ మున్సిపాలిటీలోని మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా కుట్టు మిషన్ కేంద్రాన్ని శనివారం అడిషనల్ కలెక్టర్ విద్యాచందన సందర్శించారు. కేంద్రంలో శిక్షణ పొందుతున్న మహిళల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీతానగర్ కాలనీలో మహిళల కుట్టు మిషన్ కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడుతూ.. జూన్ 2 నాటికి స్కూల్ కొత్త యూనిఫాం తయారు చేసి విద్యార్థులకు అందజేయాలని ఆదేశించారు. విద్యార్థులకు కొలతల ప్రకారం యూనిఫాం కుట్టాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ స్వామి, డీఈ మురళీ, మెప్మా రాజేష్, మెప్మా టీఎంసీ, సీఓలు మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందజేసే యూనిఫాంను స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. శనివారం కాకర్ల, మొద్దులగూడెం, అనంతారం కుట్టు మిషన్ కేంద్రాలను శనివారం సెర్ప్ డీపీఎం రమాకాంత, జూలూరుపాడు ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి, మండల నోడల్ అధికారి సంజీవరావు, సెర్ప్ ఏపీఎం సత్యనారాయణరాజులు సందర్శించి, పరిశీలించారు. పాఠశాలల పునఃప్రారంభమయ్యే నాటికి యూనిఫాం సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సెర్ప్ సీసీలు డి.నాగేశ్వరరావు, రామారావు పాల్గొన్నారు.

ప్రజల పక్షపాతి రాజమల్లు

ఇల్లెందు: సింగరేణి కార్మికవర్గంలో, ఇల్లెందు పట్టణ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన ఇల్లెందు మాజీ మున్సిపల్ చైర్మన్, ఐఎన్‌టీయూసీ నేత చొప్పరి రాజమల్లు ప్రజల పక్షపాతి అని ఆయన ఆశయ సాధనకు ప్రతీ కార్యకర్త పాటుపడాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. శనివారం ఇల్లెందులోని కాంగ్రెస్ కార్యాలయం వద్ద జరిగిన రాజమల్లు సంతాపసభలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాజమల్లు సేవలు చిరస్మరణీయమన్నారు. ఐఎన్‌టీయూసీ కోసం అవిశ్రాంతంగా పని చేసినట్లు చెప్పారు. సింగరేణి ఎన్నికల్లో సంఘం గెలుపు కోసం కృషి చేశారని, ఇల్లెందు పట్టణాభివృద్ధికి మున్సిపల్ చైర్మన్‌గా సేవలను అందించినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు ఎస్కే జానీ, దానియేల్, సైదులు, గోచికొంగ సత్యనారాయణ, గ్రంధి సదానందం, కొండూరి చిన్నా, నందకోషోర్, సుదర్శన్‌కోరీ, జీవీ వీరభద్రం, తదితరులు రాజమల్లు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కనీస వేతనం అమలుకు పోరాడుదాం..


మాట్లాడుతున్న శ్రీనివాస్

సింగరేణి(కొత్తగూడెం): కనీస వేతన చట్టాల అమలుకు కాంట్రాక్ట్ కార్మికులు మరోపోరాటానికి సిద్ధం కావాలని, ఐఎఫ్‌టీయూ జాతీయ నేత టి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం కొత్తగూడెంలోని ఇఫ్టూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణితో సహా వివిధ పరిశ్రమల్లో కనీస వేతన చట్టాలను అమలు చేసే పరిస్థితి లేదని తక్షణమే వాటి అమలుకు చర్యలు తీసుకోవాలని లేదంటే యూనియన్లకు అతీతంగా కాంట్రాక్ట్ కార్మికులు మరోపోరాటానికి సిద్ధం కావాల్సి ఉంటుందన్నారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అవుతున్నా ఇప్పటి వరకు కనీస వేతన చట్టాలను అమలు చేయించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తూ పబ్బం గడుపుతున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా చేసి కార్మిక హక్కులను హరించవేయడం తగదన్నారు. చట్టాలు ఉన్నోడి చుట్టాలుగా మార్చుకొని కార్మిక హక్కులను కాలరాస్తూ బానిసలుగా చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వరంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటుపరం చేస్తూ అదానీ, అంబానీ జేబుసంస్థలుగా మార్చటం కోసం నరేంద్ర మోదీ ప్రభుత్వం పూనుకుందన్నారు. కే.సారంగపాణి, గౌని నాగేశ్వరరావు, వీరమల్ల మల్లయ్య, నరాటి వెంకటేశ్వర్లు, రాయండ్ల కోటిలింగం, ఎనగంటి రమేష్, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల నియంత్రణకు చట్టం తేవాలి


మాట్లాడుతున్న నాగరాజు

సింగరేణి(కొత్తగూడెం): ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల దోపిడీ ఆపాలంటే రాష్ట్రంలో ఫీజుల నియంత్రణ చట్టం తేవాలని, ఆ నిబంధనలు పాటించని విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు డిమాండ్ చేశారు. శనివారం కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక టీచర్స్ భవన్‌లో తెలంగాణ రాష్ట్రంలో ఫీజుల నియంత్రణ చట్టం – అవశ్యకత అనే అంశంపై ఎస్ఎఫ్ఐ జిల్లా బయ్యా అభిమన్యు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్యవక్తగా హాజరైన నాగ రాజు మాట్లాడుతూ.. పాఠశాల ఫీజుల నియంత్రణకు ఒక విధానాన్ని తీసుకరావాలని, అందరికీ నాణ్యమైన విద్య అందుబాటులో ఉండేలా చూడటం లక్ష్యంగా పాఠశాల ఫీజు నియంత్రణ కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కొన్ని పాఠశాలలు ప్రతీ విద్యా సంవత్సరంలో 10శాతం నుంచి 30శాతం వరకు ఫీజులు పెంచుతున్నాయని, ప్రైవేట్ పాఠశాలల్లో పెరుగుతున్న విద్యా ఖర్చులను ఎదుర్కొంటున్న తల్లితండ్రులపై ఆర్థిక భారాన్ని తగ్గించడం దీని లక్ష్యంగా ఉండాలన్నారు. ప్రొఫెషనల్ కోర్సులకు సంబంధించి తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ (టీఏఎఫ్ఆర్‌సీ) తరహాలో ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల పర్యవేక్షణ నియంత్రణ కమిటీ వేయలని కోరారు. ఇంతకుముందు పాఠశాలలు తమ ఫీజు నిర్మాణాలను పాలకమండలి ద్వారా నిర్ణయించడానికి అనుమతించారని, ఇందులో పాఠశాల అధ్యక్షుడు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ సిబ్బంది ప్రతినిధి, తల్లితండ్రులు, ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు, జిల్లా విద్యాఅధికారి, నామినేట్ చేసిన పేరెంట్స్ ఉన్నారన్నారు. పాఠశాల ఫీజు నియంత్రణ కమిటీని ఏర్పాటు చేయటం వలన తల్లితండ్రులకు కొంత ఉపశమనం కలుగుతుందన్నారు. తెలంగాణ వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల్లో మరింత పారదర్శకంగా, న్యాయబద్ధంగా ఫీజులు ఉండాలని కోరారు. దేశం వ్యాప్తంగా 15 రాష్ట్రాల్లో ఫీజుల నియంత్రణ చట్టం అమలులో ఉందన్నారు. విద్యాసంస్థల్లో అడ్మిషన్ల కోసం వెళ్లిన తల్లితండ్రులకు ఫీజులు చూస్తే దిమ్మతిరుగుతోందని, గత సంవత్సరం ఫీజు కంటే 25 నుంచి 50 శాతం వరకు ఫీజులు ప్రైవేట్ స్కూళ్లు పెంచుతున్నాయన్నారు. అఖరికి పుస్తకాలు, బూట్లు, టై, బెల్ట్ వరకు ఇష్టం వచ్చినట్లు అమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల నియంత్రణపై 2017 మార్చిలో ప్రొఫెసర్ తిరుపతిరావు నేతృత్వంలో కమిటీ వేసిందని ఆ కమిటీ వివిధ రాష్ట్రాల్లోని స్కూళ్లలో అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరభద్రం, కాంపాటి పృథ్వీ, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు బాలరాజు, కాళంగి హరికృష్ణ పాల్గొన్నారు.

సింగరేణి విద్యావ్యవస్థను కాపాడండి..

సింగరేణి (కొత్తగూడెం): సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ కరస్పాండెంట్‌ని భర్తరఫ్ చేసి, సింగరేణి విద్యావ్యవస్థను కాపాడాలని శనివారం సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట తెలంగాణ ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట శివశంకర్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణి డిగ్రీ కళాశాల పేరు ప్రఖ్యాతలను కాపాడాలని కంపెనీ రూ.లక్షల జీతం చెల్లిస్తుంటే, కాలేజీ చరిత్రను భ్రష్టుపట్టిస్తున్నారని ఆరోపించారు. ఉన్నాతాధికారులను మభ్యపెట్టి కళాశాల ఉపాధ్యాయులను వేధింపులకు గురిచేస్తున్నారని వాపోయారు.

విద్యార్థులు ఎటువంటి ఫిర్యాదులు చేయకపోయినా ఎటువంటి ఎంక్వయిరీ చేయకుండా 24 సంవత్సరాలుగా పనిచేస్తున్న కేర్ టేకర్ కర్నాటి సత్యవతిని నిర్ధాక్షిణ్యంగా ఉద్యోగంలో నుంచి తొలగించారని, ఈ విషయంలో డైరెక్టర్ (పా)కు విన్నవిస్తే అందరినీ పిలిచి విచారిస్తానని చెప్పినప్పటికీ కొత్తవారిని ఉద్యోగంలోకి తీసుకోవడం విచారకరమన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థికి పట్టం కట్టండి..


మాట్లాడుతున్న వద్దిరాజు రవిచంద్ర

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఎమ్మెల్సీ ఉప ఎన్నికలలో ఏనుగుల రాకేష్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ శ్రేణులు పనిచేయాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో శనివారం పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, బానోత్ హరిప్రియ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగల రాజేందర్, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి తదితర ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టభద్రులను స్వయంగా కలిసి బీఆర్ఎస్ మహానేత కేసీఆర్ ఎంపిక చేసిన ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డికి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రచారం చేయాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ దామోదర్, ఎంపీపీ బాదావత్ శాంతి పాల్గొన్నారు.

మల్లన్నకు భారీ ఆధిక్యం అందించాలి


ఇల్లెందు: ఎమ్మెల్సీ ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య, చైర్మన్ డీవీ తదితరులు

జూలూరుపాడు: ఖమ్మం, నల్గొండ, వరంగల్ ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్)కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ కోరారు. శనివారం జూలూరుపాడు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయాన్ని కాంక్షిస్తూ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రాడ్యుయేట్లతో సమావేశం నిర్వహించారు. వైరా ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అరాచకాలను ఎప్పటికప్పుడు ప్రజల ముందు ఉంచిన జర్నలిస్టు తీర్మాన్ మల్లన్నను కాంగ్రెస్ పార్టీ గుర్తించి ఖమ్మం, నల్గొండ, వరంగల్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నిలిపిందన్నారు. ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులంతా మల్లన్నకు ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో పువ్వాళ్ల దుర్గాప్రసాద్, బొర్రా రాజశేఖర్, లేళ్ల వెంకటరెడ్డి, మాలోత్ మంగీలాల్ నాయక్, దుద్దుకూరి మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

పాపకొల్లులో.. ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపు కోసం చివరి రోజు శనివారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మండల వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేశారు. కార్యక్రమంలో లేళ్ల వెంకటరెడ్డి, మాలోత్ మంగీలాల్ నాయక్, దుద్దుకూరి మధుసూదన్‌రావు, రోకటి సురేష్, నున్నా రంగారావు, వేల్పుల నరసింహారావు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తూ అవకాశం ఉన్న ప్రతీచోట ప్రశ్నించే తత్వాన్ని అందిపుచ్చుకున్న కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య పిలుపునిచ్చారు. కొమరారం గ్రామంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టభద్రులతో శనివారం ఆయన సమావేశమయ్యారు. మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే 30వేలకు పైగా ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సమావేశంలో మండల రాముమహేష్, పులి సైదులు, ధరావత్ చంద్రశేఖర్, సూర్నపాక సత్యనారాయణ పాల్గొన్నారు.


ఇల్లెందు: కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయాన్ని కాంక్షిస్తూ కాంగ్రెస్, మిత్రపక్ష నేతలు ఇల్లెందు పట్టణంలోని మెయిన్‌రోడ్, ఆంబజార్‌లో పట్టభద్రులను కలిసి ఓటు అభ్యర్థించారు. పలువురు పట్టభద్రులను కలిసి ఓటు అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, ఎస్కే జానీ, పింగళి నరేష్ పాల్గొన్నారు.


సూపర్‌బజార్(కొత్తగూడెం): సీపీఎం, సీపీఐ, టీజేఎస్ పార్టీలు బలపర్చిన కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల కమిటీ కోఆర్డినేటర్ నాగా సీతారాములు కలెక్టరేట్ ఉద్యోగులను అభ్యర్థించారు. శనివారం కలెక్టరేట్ వద్ద మల్లన్న విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారాన్ని నిర్వహించారు. కంచర్ల చంద్రశేఖర్, కొత్వాల శ్రీనివాసరావు, కోనేరు సత్యనారాయణ, శంకర్‌నాయక్, దేవీప్రసన్న, బరపటి వాసుదేవరావు పాల్గొన్నారు.


టేకులపల్లి: ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్నను భారీ మెజారిటీతో గెలిపించి శాసనమండలికి పంపించాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం ప్రెగళ్లపాడు పంచాయతీలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. భూక్యా దేవా నాయక్, కోరం సురేందర్, మౌనిక, లక్కినేని శ్యామ్, మోకాళ్ల పోషాలు పాల్గొన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): సీపీఐ, సీపీఎం, టీజేఎస్ బలపరుస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి తీర్మార్ మల్లన్నకు మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని సీపీఐ జిల్లా నాయకురాలు కరీష రత్నకుమారి ఆధ్వర్యంలో శనివారం ప్రచారం నిర్వహించారు.

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం తీన్మార్ మల్లన్న కొత్తగూడెం టీం ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. మల్లన్న గెలిపించుకొని నిరుద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు పడుతున్న బాధల నుంచి విముక్తి పొందాలన్నారు.


సూపర్‌బజార్(కొత్తగూడెం): మాట్లాడుతున్న నాగా సీతారాములు


సింగరేణి(కొత్తగూడెం): శేషగిరి నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న రత్నకుమారి


జూలూరుపాడు: మాట్లాడుతున్న వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్

డీలర్ల వద్దే విత్తనాలు కొనాలి..


సుజాతనగర్: మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు


ఇల్లెందురూరల్: రైతులతో మాట్లాడుతున్న ఏఓ సతీష్


టేకులపల్లి: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ అన్నపూర్ణ

జూలూరుపాడు: అధీకృత (లైసెన్స్) డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) వేల్పుల బాబూరావు అన్నారు. శనివారం మాచినేనిపేట గ్రామంలో జూలూరుపాడు మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ... కాటన్ సంచుల్లో అమ్మే విత్తనాలను కొనరాదని, గ్రామాల్లోకి వచ్చి ఎవరైనా అమ్మితే వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేసి తప్పని సరిగా రసీదు తీసుకోవాలన్నారు. రసీదుతోపాటు, ప్యాకెట్లను పంట చివరి వరకు దాచుకోవాలని కోరారు. నకిలీ విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎంఆర్‌పీకే కొనుగోలు చేయాలన్నారు. నకిలీ, నాసిరకమైన విత్తనాలను రైతులకు అంటగట్టి మోసానికి పాల్పడిన డీలర్లపై కేసు నమోదు చేయడం జరుగుతుందని డీఏఓ హెచ్చరించారు. కార్యక్రమంలో కొత్తగూడెం వ్యవసాయ సహాయ సంచాలకులు దండ రమేష్, జూలూరుపాడు ఏఓ ఎస్.రఘుదీపిక, ఏఈఓ బి.గోపీకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: నకిలీ విత్తన విక్రయాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ శాఖ అధికారి సతీష్ సూచించారు. మండలంలోని పలు గ్రామాలలో శనివారం రైతులతో సమావేశమై నకిలీ విత్తన విక్రయాలపై చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలో లూజ్‌గా విత్తనాలు విక్రయిస్తే తమకు వెంటనే సమాచారం ఇవ్వాలని, అటువంటి విత్తనాలను ఎట్టి పరిస్థితిలోనూ కొనుగోలు చేయొద్దని సూచించారు. లైసెన్స్ ఉన్న దుకాణాలలో మాత్రమే కంపెనీ విత్తనాలు కొనుగోలు చేయాలని చెప్పారు. విత్తనాలు, ఎరువులను ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ఎవరు విక్రయించినా తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. విత్తనాలు కొనుగోలు చేసిన రశీదులను పంటకాలం పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

టేకులపల్లి: వ్యవసాయ సీజన్ ప్రారంభం అయిన నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని టేకులపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి నీరుడు అన్నపూర్ణ అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మండలంలోని సులానగర్, గోలియాతండా, మొక్కంపాడు, చింతోనిచెలక, కొత్తతండా గ్రామాల్లో కల్తీ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో జరిగిన అవగాహన సదస్సుల్లో మాట్లాడుతూ... రైతులు కల్తీ విత్తనాలు కొనుగోలు చేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. మండలంలో వ్యవసాయ శాఖ ద్వారా అనుమతి పొందిన డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. విత్తన ప్యాకెట్ మీద కంపెనీ వివరాలతో పాటు తయారీ తేదీ, కాలం ముగిసే తేదీ చూసుకోవాలని పేర్కొన్నారు. కలుపు రాకుండా వాడే గ్లైపోసెట్ కలిగిన బీటీ3 విత్తనాలు ఎవరైనా, ఎక్కడైనా అమ్మితే గ్రామాల్లో ఎవరైనా తిరుగుతూ విత్తనాలు అమ్మితే వ్యవసాయ శాఖ, పోలీసు అధికారులకు తెలియజేయాలని సూచించారు.

సుజాతనగర్: విత్తనాల కొనుగోళ్ల విషయంలో రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు అన్నారు. సీతంపేట బంజరలో విత్తనాలు, పురుగుమందుల కొనుగోళ్లపై శనివారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అధీకృత డీలర్ల వద్దనే రైతులు విత్తనాలను కొనుగోలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ రమేష్, ఏఓ నర్మద, ఏఈఓలు శరత్, ప్రనూష పాల్గొన్నారు.